# హిందూ పాతివ్రత్యం

తర్కాలవల్లా, వాదాలవల్లా చర్చలవల్లా, మనదేశంలో చింతకాయలుకూడా రాలవని డాక్టరూ, శాస్త్రీ, ప్లీడరూ చర్చించుకుంటూ వుంటే వింటూ కూర్చున్నాడు గోపీ.

శాస్త్రికీ, డాక్టర్‌కీ యెప్పుడూ పడదు. వేరువేరు వాతావరణాల్లో పెరగటంవల్ల ఒకరికి అభిప్రాయాలు ఒకరి నచ్చవు డాక్టర్‌కి పాశ్చాత్యనాగరికత అంటే యిష్టం, అది శాస్త్రికి మంట. ఇలా అన్నాడు.

పాశ్చాత్య నాగరికతను పొగట్టం బానిసత్వం. ఎవరికుండే గొప్ప వారికుంది. ప్రేమ్‌చంద్ ఏమన్నాడో యెప్పుడన్నా చదివావా?

ఇంగ్లండు వ్యాపారానికి ప్రసిద్ధి
ఫ్రాన్సు విలాసపతులకు ప్రసిద్ధి
జర్మనీ సైన్యాలకు ప్రసిద్ధి
హిందూదేశం పాతివ్రత్యానికి ప్రసిద్ధి—
ఇదంతా తెలుసుకోకుండా వాగితే యేం ప్రయోజనం?"

ఈ మాటలు డాక్టర్‌కి కొంచెం కష్టం కలిగించినై. కాని బైటపడకుండా యిలా అన్నాడు:

"నీ మాట వొప్పుకుంటాను. కాని పాతివ్రత్యం స్త్రీ సంబంధం. అందులో వివాహమైన స్త్రీ మనదేశంలో అంతా వివాహమైన స్త్రీలే కాదుగా! వివాహమయిన స్త్రీ గొప్పతనాన్ని దేశానికి అంటగట్టుకొని మురుకోవటం దద్దమ్మ పని. అదే మన బానిసబుద్ధుని నిరూపిస్తుంది. మిగిలినవారంతా ఎందులో గొప్పో చెప్పు."

శాస్త్రి కేమీ తోచలేదు. అంత త్వరగా అతడాలోచించలేదు "మనం మాత్రం ఊరుకుంటున్నామా ఏమిటి? పాతివ్రత్యాన్ని కాపాడుతున్నాం" అన్నాడు.

"ఏయ్ అదేంమాట! పురుషులకు ఐతేవని పెట్టావ్!" అన్నాడు ప్లీడరు.

డాక్టర్ ఊరుకోలేదు. సిగరెట్ కిటికీలోంచి పారవేసి శాస్త్రివైపు తిరిగి "ఏ విధంగానో చెప్పు. బిరానీలు తింటూ కూర్చోనా?" అని అడిగాడు.

శాస్త్రికి కోపం వచ్చింది. నిజంగా అతనికి బిరానీలంటే ఇష్టం. అందుకని వళ్ళు మండిపోయింది. కాని డాక్టరు అతనికి అవకాశం యివ్వకుండా మాట్లాడేస్తున్నాడు.

"పాతివ్రత్యం మన దేశంలో పుష్కలంగా పండుతుందని ఒప్పుకుందాం. కాని, అది ఒకపని చెయ్యకపోవటాన్ని తెలియజేస్తుంది. మనం యే పని చెయ్యటంలో గొప్పో చెప్పాలి. ఎందుకంటే కొన్ని పనులు చెయ్యటంవల్లే మానవునికి శ్రేయస్సూ, అభివృద్ధీ కలుగుతాయి. ఈపద్ధతిని మన మెందులో గొప్పో చెప్పు!"

"పాతివ్రత్యం కాపాట్టంలో అని చెప్పేవ్ బాబూ" అంటూ ప్లీడరు శాస్త్రికి వార్నింగిచ్చాడు. "ఎందుకంటే మనం మళ్ళీ బిరానీలు తినాలి సొస్తుంది."

గోపీ, డాక్టరూ ఫక్కున నవ్వారు.

శాస్త్రికి కోపం ఎక్కువయింది. "మెబోటివా రుండబట్టే దేశం ఈ స్థితికి వచ్చింది...." అని మొదలుపెట్టాడు. కాని డాక్టర్ అతన్నిమాట్లాడనివ్వకుండా ఆపి, "మరి మనదేశం గొప్పదంటున్నావే!" అని ఎత్తి పొడిచాడు.

"స్త్రీల విషయంలో! స్త్రీల విషయంలో!" అనిదిద్దాడు ప్లీడరు.

ఇంతలో పైటనుంచి గోలా, కేకలూ వినిపించినై. వాదాన్నివొదిలి నలుగురూ బయటికి పరుగెత్తారు.

రోడ్డుమీద పెద్దగుంపు పోగయింది. పక్క ఇళ్ళల్లోనుంచి స్త్రీలు వినోదాన్ని చూస్తున్నారు. ఒకరితో ఒకరు చెప్పుకుంటూ ఆనందిస్తున్నారు.

ఆ గుంపుమధ్య ఒకముసల్దీ, దాని కూతురూవున్నారు. ముసల్ది ఏడుస్తూనేవుంది. కూతురు ఆ జనంలోనుంచి తప్పించుకుపోవటానికి బిత్తరి చూపులు చూస్తూవుంది. ఇంతలో ఎక్కడినుంచోఒక జట్కాబండొచ్చింది. ఒకడు అందులో నుంచి దూకాడు, ఆ పిల్లని బలవంతంగా ఎత్తుకొని బండిలో వేశాడు. ఆమె తన్నుకుంటూవుంటే కాళ్ళు పైకితోసి తానూ బండెక్కాడు. బండి కదిలింది. గుఱ్ఱం పరుగెత్తింది. క్షణంలో అదృశ్య మైంది.

తల్లి యేడుస్తూ వుంది-"ఇక నా కూతుర్ని బ్రతకనివ్వడు-బ్రతక నివ్వడు" అని నెత్తీ నోరు కొట్టుకుంటూనే వుంది. అంతా చూస్తూవుండ గానే యీపని జరిగిపోయింది. ఒక్కరూ అడ్డగించలేదు, ప్రశ్నించలేదు.

గోపీకి ఆశ్చర్యంవేసింది. అమానుషంగా కనిపించింది. ఆగుంపులో నుంచి ఒక ముసలివాణ్ని పిలిచి అడిగాడు.

"ఏమిటిది?"

"ఆ పిల్లవాడి భార్యబాబూ, తీసుకపోయాడు."

"దానికి బలత్కారమెందుకూ!" అని ప్రశ్నించాడు శాస్త్రి.

"ఆ అమ్మాయి రానంటుంది. అంతా ఆ తల్లిముండ చేస్తోంది బాబూ! మొగుడిదగ్గరకు పంపదు."

డాక్టర్ ఈ సంభాషణ చాలా శ్రద్ధగా వింటున్నాడు. మధ్య మధ్య శాస్త్రిని కొంటెచూపులు చూస్తున్నాడు. శాస్త్రి అడిగాడు.

"తల్లికి పిల్ల సుఖంకంటే ఏం కావాలి? ఎందుకు పంపనంటుంది!"

"అది దరిద్రపు ముండబాబూ. ఆ పిల్లని అడ్డం పెట్టుకొని పొట్ట పోసుకుంటూ వుంది."

"ఆఁ!" అన్నాడు శాస్త్రి. ఒక తేప తేపాడు డాక్టర్. చిటికలువేస్తూ ఆవలించాడు ప్లీడరు.

"అవును బాబూ, ఈ వూళ్లో యాపారం పెట్టింది" అని చెప్పి వెళ్ళిపోయాడు ముసలివాడు.

"పాపం! తీసుకువెళ్ళి చంపడుగదా?" అని జాలిపడ్డాడు గోపీ.

"చంపడు. పాతివ్రత్యం కాపాడుతాడు" అన్నాడు డాక్టరు. శాస్త్రికి ఉక్రోషం వచ్చింది. "ఏం చేసుకుంటేమీకేం? అది వాడి భార్య ముద్దుపెట్టుకున్నప్పుడు ముద్దు పెట్టుకోలా? చంపుకున్నప్పుడు చంపుకుంటాడు. తనతో కాపరం చేయించుకోకుండా చూస్తూ ఊరుకుంటాడా ఏమిటి?" అన్నాడు.

"ఇష్టంలేని భార్యతో సుఖపడేదేమిటోయ్, వాడి పిండాకూడు?" అన్నాడు గోపీ.

"ఇష్టమేమిటి ఇష్టం? భార్యన్న తరువాత తప్పుతుందా యేమిటి? ఇష్టమున్నా భార్యే, ఇష్టం లేకపోయినా భార్యే. కోర్టుకూడా ఈమాట చెబుతుంది."

శాస్త్రి ఈమాటలు అంటూ చూపులో ప్లీడరు సహాయం కోరాడు.

ప్లీడరందుకున్నాడు. "ఔను, కోర్టు అంతే చెబుతుంది. ప్రాణభయమున్నట్లు నిరూపిస్తే తప్ప భార్య వేరుగా జీవించటానికి వీల్లేదు. అలా నిరూపించటం చాలా కష్టం. ఎందుకంటే మనదేశంలో ప్రాణభయం ఒకప్పుడూ, ప్రాణం పోవటం మరొకప్పుడూ జరగదు."

"అయితే వాళ్ళిద్దరూ కలిసి కాపరం చెయ్యవలసిందేనా?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు గోపీ.

"భార్య చెయ్యవలసిందే భార్తచేత మాత్రం యే శాస్త్రమూ చేయించలేదు" అని జవాబు.

"భార్య యింటో పాతివ్రత్యం వండుతూవుంటే భర్త మరో యింటిలో పెచ్చాలు కొంటూవుంటాడు" అన్నాడు డాక్టర్.

"కాదు ఐతానీలు?" అని దిద్దాడు ప్లీడరు.

"ఏం ప్రాతివ్రత్యం! ఎంత జాగ్రత్తగా కాపాడబడుతూ వుంది—మన దేశంలో? హిందూసంఘం!" అని చీదరించుకున్నాడు డాక్టర్.

హిందూ సంఘ స్థితి యిలావుంది. కుళ్ళిపోతూవుంది. దీన్ని కప్పి పుచ్చుకొని ఆత్మవంచనతో జీవించటానికి మనం ప్రయత్నిస్తున్నాం. హిందూసంఘంలో తండ్రికీ కొడుక్కీ పట్టంలేదు. కూతురికీ తండ్రికీ పట్టంలేదు. కొడుక్కీ తల్లికీ అత్తకీ కోడలికీ పట్టంలేదు. తల్లికీ కూతురికీ పట్టం లేదు. భార్యకీ భర్తకీ పట్టంలేదు—ఎవరికీ ఎవరికీ పట్టంలేదు. కాని వీరంతా ఒకే ఇంటిలో ఒక కప్పుకింద కాపురం చెయ్యాలి. దుర్గంధం బయటకు రాకుండా కిటికీలూ మూసుకొని కూర్చోవాలి.

....డాక్టరు శాస్త్రిని కొంటెగా చూచి నెమ్మదిగా కూనిరాగంతో ఈ విధంగా పాడాడు.

ఇంగ్లండు వ్యాపారానికి ప్రసిద్ధి

ఫ్రాన్సు విలాసవతులకు ప్రసిద్ధి

జర్మనీ సైన్యాలకు ప్రసిద్ధి

ప్రసిద్ధి!

ప్రసిద్ధి!!

ప్రసిద్ధి!!!